రైల్వే ఉద్యోగాల కోతలు రద్దు చేయాలి

విశ్వంభర, సికింద్రాబాద్ : రైల్వేల్లో ఉద్యోగాల కోతలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. మానవ వనరుల సమీకరణ పేరుతో రెండు శాతం పోస్టులు తగ్గించే నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సికింద్రాబాదులోని రైల్ నిలయం వద్ద శుక్రవారం నిరసన నిర్వహించి, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన నిర్వాహక అధికారి సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేశారు.రైల్వేల్లో లక్షల ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టకుండా ఉద్యోగాలు తగ్గించడం సరైంది కాదని అన్నారు. ఈ నిర్ణయం ప్రైవేటీకరణకు దారితీస్తుందని ఆరోపించారు. రైల్వే నియామక బోర్డు పరిధిలోని పలు విభాగాల ఫలితాలు పెండింగ్‌లో ఉండటంతో యువత నిరీక్షణలో ఉన్నారని తెలిపారు. ఖాళీలను వెంటనే భర్తీ చేసి, ఉద్యోగాల కోత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, కోశాధికారి పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, ఎల్లంకి మహేష్, శేఖర్, మధుకర్, రాజ్ కుమార్, మెస్రం భాస్కర్, ఆంజనేయులు, చారి, అజీమ్, భరత్, అలీ, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

కళలకు ప్రజల ఆదరణే ముఖ్యం

- జస్టిస్ నాగ మారుతి శర్మ

విశ్వంభర, చిక్కడపల్లి : కళలు ఎదగాలంటే ప్రజల మద్దతు చాలా అవసరమని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ అన్నారు. బుర్రకథలకు ప్రజా నాట్య మండలి వల్ల మంచి గుర్తింపు వచ్చిందని, నాజర్ లాంటి కళాకారులు చైతన్యభరితమైన కథలను తెలుగు ప్రాంతాల్లో విస్తరించారని చెప్పారు. హైదరాబాదు చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో కళా సుబ్బారావు జయంతి సందర్భంగా జరుగుతున్న బుర్రకథ సప్తాహంలో భాగంగా శుక్రవారం చౌకు లింగం బృందం 'భక్త మార్కండేయ' బుర్రకథను ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి వచ్చిన జస్టిస్ నాగ మారుతి శర్మ కళాకారులను సత్కరించారు.గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి తన తండ్రి జ్ఞాపకార్థం గానసభకు రూ.25 వేల విరాళం ప్రకటించారు. సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు గానసభ ప్రాముఖ్యతను వివరించారు.

మోడీ పర్యటనకు ఆప్ నిరసన

విశ్వంభర, హిమాయత్ నగర్ : ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్, రాష్ట్ర కన్వీనర్ హేమ జిల్లోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాదు హిమాయత్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే పర్యటన చేస్తున్నారని విమర్శించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాలేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, యువతకు ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలతో చిన్న వ్యాపారులు, హోటల్ రంగం, సాధారణ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం కంటే ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారని, నిరుద్యోగం పెరుగుతోందని ఆరోపించారు. ప్రతిపక్షాలపై కేంద్ర సంస్థలను రాజకీయంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో నల్ల జెండాలు, ప్లకార్డులతో నిరసన చేపడతామని, యువత, నిరుద్యోగులు, వ్యాపారులు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు దర్శనం రమేష్, రాకేష్ రెడ్డి, బాబూలాల్ పవార్ పాల్గొన్నారు.

రాజకీయ భిక్ష పెట్టిన గడ్డను మరువను

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటనతో కొడంగల్ నియోజకవర్గం శుక్రవారం జనసంద్రమైంది. తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనుల జాతరకు శ్రీకారం చుట్టారు. సుమారు 10 వేల మందికి పైగా జనం తరలివచ్చిన భారీ బహిరంగ సభలో ఆయన భావోద్వేగంగా ప్రసంగిస్తూ, కొడంగల్‌ను దేశంలోనే నంబర్ 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 'పేదల తిరుపతి'గా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.110 కోట్లభారీ బడ్జెట్‌తో శంకుస్థాపన చేశారు.6 ఎకరాల స్థలంలో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణం,18 నెలల్లో పనులు పూర్తి చేసి, తిరుమల తరహా అనుభూతిని భక్తులకు అందించడం. దీనితో పాటు దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 2.16 కోట్లు,కోస్గి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి రూ. 2 కోట్లు కేటాయించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల

అయిన మెరుగైన వైద్యాన్ని చేరువ చేస్తూ, రూ. 255 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 430 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి సీఎం పునాది రాయి వేశారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అత్యాధునిక చికిత్సలు అందేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. "ఈ కొడంగల్ గడ్డ నాకు జన్మనిచ్చిన గడ్డ కాదు, కానీ రాజకీయ భిక్ష పెట్టిన గడ్డ. ఇక్కడి ప్రజల ఆశీస్సులే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. అందుకే రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆధ్యాత్మిక, వైద్య రంగాల్లో కొడంగల్‌ను అగ్ర స్థానంలో నిలుపుతాను" అని అన్నారు. ముఖ్యమంత్రి రాకతో పట్టణంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.లగచర్లను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చుతున్నామని చెప్పారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రి గారితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, వాకిటి శ్రీహరి గారు, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి గారు, మనోహర్ రెడ్డి గారు, పలువురు ప్రజా ప్రతినిధులు, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు గారు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి శైలజ రామయ్యర్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మిశ్రా, ఆర్ అండ్ బి ఈఎన్సీ మోహన్ నాయక్, సంగారెడ్డి ఎస్ఈ, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీపీఆర్వో చెన్నమ్మ , ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుదలకై శాంతియుత నిరసన

పార్ట్ టైమ్ స్వీపర్స్ యూనియన్

విశ్వంభర, హైదరాబాద్ : పౌర గ్రంధాలయ శాఖ తెలంగాణ పార్ట్ టైమ్ స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రంధాలయ డైరెక్టర్ , రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయాల వద్ద శాంతి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే మా వేతనాల పెంపుదల కొరకు ఈ నిరసనను చేపట్టామని అలాగే సమాన పనికి సమాన వేతనం ద్వారా వేతనాలు చెల్లించాలి . సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి అనే ప్రధానమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ శ్రీహరి , రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.రియాజ్ లకు వినతిపత్రం అందజేశారు.గత 30 సం.రాలుగా పని చేస్తున్నామని ఉద్యోగ భద్రతా కల్పించకపోవడం అలాగే

జీతాలు పెంచకపోవడం వలన కుటుంబ పోషణ చాలాభారంగా ఉందని అన్నారు. ప్రస్తుత జీతం 6000 వేల రూపాయలు దేనికి సరిపోవడం లేదని ప్రస్తుత కాలంలో నిత్యావసర ధరలు , పిల్లల పోషణ , స్కూల్ ఫీజులు భారం అవుతుందని వాపోయారు. పేరుకే స్వీపర్లమే కానీ ఇప్పుడు ప్రతి గ్రంథాలయంలో మేమే ఫుల్ టైమ్స్ స్వీపర్గా, అటెండర్ గాను, రికార్డ్స్ అసిస్టెంట్ గాను, అలాగే గ్రంథపాలకులుగా విధులు కూడా మేమే నిర్వర్తిస్తున్నామని అన్నారు. రికార్డ్స్ రాయడం బిల్స్ చేయడం వంటి పనులు కూడా చేస్తున్నామని అయినా ప్రభుత్వం గుర్తించకపోవడం బాధగా ఉందని అన్నారు. దీనిపై స్పందించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.రియాజ్ ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిట్ట హుస్సేన్ , గౌ.అధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి మధు కస్తాల తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

విశ్వంభర, చర్ల : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలోని టోకే అడవుల్లో మావోయిస్టుల డంప్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీఎస్ఎఫ్, పోలీసు బలగాలు సంయుక్త ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో 315 బోర్ రైఫిళ్లు, 12 బోర్ రైఫిళ్లు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, లైవ్ కాట్రిడ్జ్‌లు, భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, ట్రిగ్గర్ మెకానిజమ్‌లు, వైర్లు, కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర సామగ్రి ఉన్నాయి. మావోయిస్టులు భారీ దాడికి పాల్పడేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీనికోసం అడవిలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను దాచిపెట్టారని భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. డంప్‌ను సకాలంలో కనుగొనడంతో మావోయిస్టుల కుట్రను బలగాలు భగ్నం చేశాయి.

ఆర్టీసీ విలీనంపై ఏపీ పర్యటన

విశ్వంభర, ఏపి డెస్క్ : తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ విలీన ప్రక్రియపై అధ్యయనార్థం ఆంధ్రప్రదేశ్‌లో రెండో రోజు పర్యటన నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య, జాయింట్ సెక్రటరీ పల్లె కృష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోలి రవీందర్, సిటీ రీజియన్ సెక్రటరీ బుల్లెట్ పాండు, నల్గొండ రీజియన్ ప్రెసిడెంట్ తవిటి మురళి పాల్గొన్నారు.వివిధ డిపోలలో యూనియన్ నాయకులు, డిపో అధికారులు, ఉద్యోగులతో మమేకమై విలీన ప్రక్రియలో ఎదురైన సమస్యలు, అనుభవాలపై వివరాలు సేకరించారు. వేతన సవరణ, పెన్షన్, వైద్య వసతి, పరిపాలన, ఫైనాన్స్ అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో సేకరించిన సూచనలు తెలంగాణలో జరగబోయే విలీన ప్రక్రియ అమలుకు ఉపయోగపడతాయని నాయకులు తెలిపారు.

ఐపీఎస్ అధికారి భార్య హత్య

విశ్వంభర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్‌రే భార్య తనూజ హత్య కేసులో పోలీసుల విచారణ కొనసాగుతోంది. పది ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నారు. లఖ్‌నవూ, ముంబయి, నేపాల్ సరిహద్దుకు ఆయా బృందాలు బయల్దేరాయి. హత్య అనంతరం నిందితులు నాంపల్లి వెళ్లి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. ఆటోలో నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితులు.. తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కి వెళ్లిపోయినట్లు నిర్ధరించారు. తనూజ హత్యలో పనిమనిషి కల్పన కీలకపాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మరో ఇద్దరితో కలిసి పక్కా ప్రణాళికతో ఆమె దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. తనూజను హత్య చేసిన అనంతరం ఇంట్లోని బంగారం, నగదు తీసుకుని ముగ్గురు నిందితులు పరారయ్యారు.

ఐఎన్ టియూసి 327 యూనియన్ ఆధ్వర్యములో మేడే వేడుకలు

విశ్వంభర, మునుగోడు : మునుగోడు మండల కేంద్రంలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యములో మేడే కార్మిక దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద సబ్ డివిజన్ లీడర్ పెరుమాండ్ల నరసింహ ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జెండా ఎగురవేశారు..సమాజ నిర్మాణంలో కార్మికులు పోషిస్తున్న పాత్ర కీలకమైనది అన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి ,హక్కుల పరిరక్షణకు ఐఎన్ టియూసి 327 యూనియన్ పనిచేస్తుందని అన్నారు. జిల్లా అధ్యక్షులు సమ్మిరెడ్డి,డివిజన్ సెక్రెటరీ పాండు, స్వామిరెడ్డి, నాగయ్య, జ్యోష్ణ, నర్సింహస్వామి, అనిల్, బిక్షం, మోహన్, వరప్రసాద్ జిల్లా, డివిజన్, నాయకులు పాల్గొన్నారు.

మెగా హారం ఫెస్ట్ లో మెరిసిన మోడల్స్

విశ్వంభర, హైదరాబాద్ : అద్భుతమైన నైపుణ్యం, విశ్వసనీయ వారసత్వం, ప్రత్యేకమైన బ్రైడల్ కలెక్షన్లకు ప్రసిద్ధి చెందిన దేవి పవిత్ర గోల్డ్ & డైమండ్స్, నగరంలో ఇప్పటివరకు ప్రదర్శించని అత్యంత భారీ, ప్రత్యేకమైన హారాల కలెక్షన్‌ను కెపిహెచ్బి, పిఎన్ఆర్ ఎంపైర్ లోని స్టోర్ లో నిర్వహిస్తున వేడుకలో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫెస్ట్ లో ప్రదర్శనకు ఉంచే కలెక్షన్లను మోడల్స్ ధరించి ఫ్యాషన్ వాక్ చేసి ప్రదర్శించారు. ఈ మెగా హారం ఫెస్ట్‌లో 500కు పైగా ప్రీమియం హారాలు ప్రదర్శనలో ఉంచారు. సంప్రదాయ, ఆధునిక, యాంటిక్, టెంపుల్, నక్షి, విక్టోరియన్, బ్రైడల్ డిజైన్లలో విభిన్న శైలులు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్స్ జగదీష్, నాగ ప్రణీత్ మాట్లాడుతూ.. వినియోగదారులకు ఒకే చోట అసాధారణమైన జ్యువెలరీ షాపింగ్ అనుభవాన్ని అందించడంతో పాటు, గోల్డ్, డైమండ్ జ్యువెలరీ విభాగంలో తాజా ట్రెండ్స్, అత్యుత్తమ నైపుణ్యాన్ని పరిచయం చేయడమే ఈ ఫెస్ట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వినతి

విశ్వంభర, సరూర్ నగర్ : గత 2సంవత్సరాలనుండి ఉమ్మడి ఆర్కేపురం డివిజన్ వివిధ కాలనీలలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులను త్వరగతిన పరిశీలించి ఆయా పనులకు టెండర్ లను పిలిచి పనులు మొదలు పెట్టాలి అని మహేశ్వరం నియోజకవర్గ బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఎల్బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో కు వినతి పత్రాన్ని అందజేశాడు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ మాజీ మంత్రి , మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్ ను కలసి తద్వారా కాలనీ అభివృద్ధి కి తోడ్పాడవలసిందిగా మనవి చేయడమైనది అని తెలిపారు. త్వరలో పనుల పరిశీలనకు వస్తానని చెప్పడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారోజు రామచారి, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, జై శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ను తెలంగాణ రాష్ట్ర డిజిపీ సి.వి. ఆనంద్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. మంత్రి గారు కూడా శాలువా కప్పి సి.వి. ఆనంద్ ను అభినందించారు. పోలీసింగ్‌లో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అభిలషించారు.

గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు ప్రభుత్వం సమ్మతి

- జగ్గారెడ్డి కోరిక మేరకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం అంగీకారం
- 3000 ఎకరాలకు గంగ కత్వ ద్వారా సాగునీరు
- దశాబ్దాలుగా ఆధునీకరణ కు నోచుకోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారుల తో సెక్రటేరియట్ లో సమావేశమైన జగ్గారెడ్డి
- గంగ కత్వ ఆధునీకరణ పనులకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో శంఖుస్థాపన

విశ్వంభర, హైదరాబాద్: సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలంలో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు ,స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ.42 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్ లో జగ్గారెడ్డి సమావేశం అయ్యారు. గంగకత్వ కాలువకు చేపట్టబోయే ఆధునీకరణ పనులపై ఈ సమావేశం లో చర్చించారు.

ఆధునీకరణ పనులు ఇలా...

గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువ కు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జి ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

సీఎం రేవంత్ రెడ్డి తో శంకుస్థాపన..

సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సంగారెడ్డి కి రానున్న నేపథ్యం లో గంగకత్వ పనులకు సైతం సీఎం తో శంకుస్థాపన చేయించేందుకు జగ్గారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు త్వరత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గంగ కత్వ పనులకు శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి అధికారులకు వివరించారు.